తెలుగు కళాసమితి న్యూజెర్సీ 1988 విభవ ఉగాది మినీ కథల పోటీలో రు. 300 బహుమతి పొందిన కథ




ఆ రోజు కృష్ణమూర్తి ఆఫీసుకు పోలేదు. ఏమిటో అతనికి ఈ మధ్య దేనిమీదా మనస్సు నిలవడం లేదు. ఇటూ, అటూ తిరుగుతున్నాడు. దొడ్లోకి వెళ్లేడు. అతను ఈ మధ్యనే పాతిన అరటి మొక్క వేపు చూసేడు. అది చాలా చిన్న మొక్క. దాన్ని తేచ్చేటప్పుడే దుంప సగం తెగి పోయింది. బ్రతుకుతే బ్రతుకుతుంది, పోతే పోతుంది అనుకుంటూనే దాన్ని పాతేడు. అది చాలా రోజులు కొన ఊపిరితో అల్లాగే వుండేది.

దాన్ని ఎవరూ సరిగా చూడడం లేదు. రోజూ దానికి ఎవరూ నీళ్లు పోయరు. అది చిన్న మొక్క అనే చిన్నచూపు అందరికీ. అంచేత దానికిచ్చే పెద్ద మొక్కలకు పోస్తారు. ఇది ఒక్కటే దూరంగా వేరుగా వుండడం మరొక కారణం. అనుకోడమేకాని తనూ నీళ్లు పోయడం లేదు. కాని ఒక పని మాత్రం చేస్తున్నాడు. ప్రొద్దుటేదాని మొదట్లో ముఖం కడుక్కుంటాడు. తను మొదట్లో పోసిన ఆ నీళ్లకే అది చాలా సంతోషిస్తుంది. తనంటే దానికెంత ప్రేమ. కాని అది చెప్పలేదు. తన దగ్గర దాని స్పందనలు కనిపెట్టగల ఏ రికార్డరూ లేదు. కాని అది తనతో మాట్లాడితే ఎల్లా వుంటుంది? నీవు నాకు చాలా సహాయం చేశావు. నా మనుగడకి నీవే కారణం అంటుంది. అప్పుడు తాను ఏం చెయ్యాలి? ఏమిటో ఇది వరకు మొక్కలు మాట్లాడేవి అంటారు. ఇప్పుడు మాట్లాడడం లేదు కాని ఆ లేత ఆకుని ఏదో చెయ్యాలనిపిస్తోంది. ఆ! అదే ముద్దు పెట్టుకోవాలనిపిస్తోంది. ముద్దు పెట్టుకుంటే ఏం చేస్తుంది? ఆ చిన్న మొక్క ఏమీ చేయదు. ఏమీ అనదు. ఊరుకుంటుంది. బాధ పడుతుందా? ఏమో తెలియదు.

అతను లేచాడు. లోపలి కెళ్లి ఒక బ్లేడు తెచ్చేడు. దాన్ని ఈనెలుగా కొయ్యాలి. లేకపోతే ఇంట్లో వాళ్లు బ్రతకనీయరు. వెంటనే కోసేస్తారు. అనుకుంటూ దగ్గరికి వెళ్లేడు. దాన్ని చూస్తే జాలి వేస్తోంది. కొయ్యాలా! వద్దా? కోస్తే ఏం జరుగుతుంది? దానికి ఉపకారమా? అపకారమా? ఏదైనా బాధ కలుగుతుందేమో. అతను కొంచెం వంగేడు. అది నవ్వుతూ తనవేపే చూస్తోంది. దాన్ని ఒకసారి తడిమేడు. ఎంత మెత్తగా వుంది? ఎంత ముద్దుగా వుంది. ఇటు అటూ చూసేడు. ఎవరూ లేరు. దాన్ని ఒకసారి ముద్దు పెట్టుకున్నాడు. అది ఇష్టంగా తలాడించినట్టు కదిలింది. అడుగున వున్న చిన్న బొరుగు కన్పించింది. బ్లేడుతో కోసి అవతల పారేశాడు. అది అందంగా తయారైంది. అమ్మయ్య! చీదర వదిలింది అన్నట్టు తన వైపు తృప్తిగా చూసింది.

*    *    *

ఎవరో తలుపు కొట్టిన చప్పుడు. ఇప్పుడే రావాలా! విసుక్కుంటూ వెళ్లి తలుపు తీసేడు.

'మువ్వా! అన్నాడు, చింపిరి జుట్టు ఎత్తుపళ్లు, బాన కడుపు. సమయానికి కొచ్చిందిరా బాబూ అనుకున్నాడు.

ఏంటండీ బాబు ఇంత ఆలస్యం. తలుపు బేగే తియ్యరేంటి? ఏం చేస్తున్నారేమిటి లోపల? అనడిగింది.

ఏం చెయ్యడం లేదు అన్నాడు ముక్తసరిగా, అవును తనేం చేస్తున్నాడు. ముద్దు పెట్టుకున్నాడు. ఆకుని ముద్దు పెట్టుకొన్నాడు. ఎవరైనా చూస్తే ఏమౌతుంది? ఆ మొక్క ఎవరితోనూ చెప్పదు. కాని ఎవరైనా చూస్తే తనని పిచ్చివాడంటారు. సున్నితమైన ఆ ఆకుని ముద్దు పెట్టుకుంటే ఏం తప్పు? అదే మనుష్యుల్ని ముద్దు పెట్టుకుంటే ఎంత గొడవ, పెళ్లయితే ఎన్ని ఆంక్షలు, అవకపోతే ఎన్ని హద్దులు? ముద్దుకి ఇంత చచ్చిపోతారు జనం ఎందుకో? అందులో ఏముంటుంది? అది ఎంత ఖరీదు! ఎన్నో వేలు పోసి కొనుక్కొంటున్నారు! ఎందుకో అనుకున్నాడు.

*    *    *

కృష్ణమూర్తి మరల దొడ్లోకి వచ్చేడు. చిరుగాలి వీస్తోంది. ఆకు సన్నగా, నాజూగ్గా కదుల్తోంది. ఏం! సంశయిస్తున్నావు? అన్నట్టు తనకేసి చూస్తోంది? ఎందుకు? ముద్దిమ్మనా? ఒకసారి అలవాటైందిగా?. లేకపోతే ఇది వరకటి అనుభూతి తలచుకుంటోందా? ఏమైతేనేం, తనను పిలుస్తోంది! అతను ముందుకు వంగేడు.

ఊ! అని వెనక్కి తిరిగింది పని మనిషి. వెధవ దోమలు అనుకుంటూ దోమల్ని కొట్టుకుంటూ వెనక్కి

చూసింది అక్కడే నిల్చుని నిందాకటి నుండి ఏటి సేత్తున్నారు? దానికి ఆకులు లేవు. పువ్వులు లేవు అస్తమానం ఏమీ లేని దానికేసి చూస్తే ఏమొస్తుంది! ఏం లేదు. నీవు నీ పని చూసుకో అన్నాడతను.

ఇల్లాగే అనుకుంటుంటారు. నీవు కావు అన్నట్టు ఆకు నవ్వింది. అవును. ఎవరేం అనుకుంటే తనకేం. ఒకసారి ముద్దు పెట్టుకుంటా! అనుకుంటూ అతను మెల్లిగా వంగేడు. పనిమనిషి అంట్లు తెస్తూ చూసింది. ఏంటి బాబూ ఆ మొక్క వదిలేట్లు లేరు. ఈ యేల అక్కడే పడుకుండేట్లున్నారు మీ వరస సూత్తే అంది.

'నీ పనయితే వెళ్లు' అన్నాడు విసుగ్గా కృష్ణమూర్తి. అయినా ఎంతసేపు సూత్తారు. దిష్టి తగులిద్ది' అంటూ వెళ్లిపోయింది పని మనిషి.

* * *

తలుపు వేసి లోపలికొచ్చేడు కృష్ణమూర్తి. బీరువా తెరిచాడు. అందులో నుండి ఒక అందమైన కవరు తీసేడు. అది నీలంగా, అందంగా వుంది. అది చాలా విలువైన కవరు. ఆ కవరు తెరిచేడు. దొడ్లోకి వచ్చి ఆకు మీద పెట్టి చదవడం ప్రారంభించేడు. ఎంత అందమైన అక్షరాలు, ముత్యాల కోవలా వున్నాయి ఆ అక్షరాలు. ఎన్నిమధుర భావనలు? ఎన్ని విలువైన ఊహలు. అంత విలువైన ఉత్తరాన్ని అతను చదవడం ప్రారంభించేడు.

డియర్!


నీ ప్రేమ నిజమైనదని తెలిసి నా శరీరం కన్నా, నా మనస్సే నిన్ను ఎక్కువగా కోరుతోంది. నిన్న రాత్రి నీవు ఇచ్చిన ముద్దు రాత్రి అంతా నన్ను కలవర పెట్టింది. దొంగచాటుగా నీవు పెట్టిన ముద్దు ఎంత తీయగా వుంది. అసలు నన్నడుగుతే ప్రపంచంలో అన్నిటికన్నా గొప్పది ప్రియుడు పెట్టిన దొంగ ముద్దు. అప్పుడు ఏం జరిగిందంటే ఊహు నేను చెప్పను.'

అతనా లేఖ రెండుసార్లు చదివేడు. ఎంత బాగా వ్రాసింది. చక్కెర పందిరిలో తేనె వాన కురిసినట్లుంది. అది నవరసాల గని. ఆసందార్ణవములో అనుభూతుల అలలు. ఇదే పూర్వకాలం అయితే అక్షర లక్షలు ఇచ్చేవారు అనుకుంటూ వీధి వేపు చూసేడు. ఈ రోజు తప్పక ఉత్తరం రావాలి. కాని ఇంకా రాలేదు. క్రొత్త నవల్స్ తిరగేస్తోందేమో వ్రాయడానికి. అతనిలో ఉద్వేగం హెచ్చింది. ఆకును మెల్లిగా స్పృశించేడు. దాని ప్రక్కన ఎండిన ఆకు కన్పించింది. చీ ఈ ఆకు ఎందుకు ఎండిపోతుందిలా? దానిలా నవ నవలాడుతూ ఇది కూడా వుండకూడదా? వుండటానికి వీల్లేదు. అన్నట్టు చూసింది లేత ఆకు. ఎంత స్వార్థం. ఎండినా ఇల్లా ఓ ప్రక్కగా వుంటే నీ సొమ్మేం పోయింది? అన్నట్టు చూసింది ఎండుటాకు. కాదు! దాన్ని కోసెయ్యి! అది వుంటే నా శోభ పోతుంది. అందుచేత ఆకు

'వద్దు' నన్నిలా వుండనీ' అన్నట్టు బేలగా చూసింది ఎండుటాకు.

* * *

తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) వారి
బహుమతి పొందిన కార్టూను




తనేం చెయ్యాలి ఇప్పుడు అనుకుంటుండగా పోస్టు అన్న కేక విని హడావిడిగా వాకిట్లోకి పరిగెట్టేడు. కవరు లోపలికి విసిరి వెళ్లిపోయాడు పోస్టుమాన్.

తనకి ఆప్యాయమైన, విలువైన ఉత్తరాన్ని అల్లా విసిరి వేయడమేమిటి? కోపం వచ్చింది కృష్ణమూర్తికి. ఉత్తరం వచ్చిన ఆనందంలో కోపం పోయింది. ఏం వ్రాసిందో! ఎన్నాళ్లకి వ్రాసింది? ఎల్లా వుందో ఏమిటో! గుండె గబగబ కొట్టుకోసాగింది. ఆతృతతో కవరు చించేడు. అన్ని అక్షరాలూ అలుక్కు పోయినట్టున్నాయి. తనకు కావలసినదేదీ కన్పించలేదు. మెరిసే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. మనస్సు చిక్కబట్టుకుని మెల్లిగా చదివేడు.

మిస్టర్!

నీవు ప్రేమతో పంపిన డబ్బు అందింది. చాలా థాంక్స్. కాని స్త్రీ కోరుకునేది డబ్బు, ఐశ్వర్యం కాదు. అతని గుండెల్లో స్థానం. నాకు డబ్బెందుకు? అందుచే నీవిచ్చిన డబ్బంతా నాకు ఉద్యోగమిచ్చిన వాళ్లకి ఇచ్చేశాను! మరి నీకివ్వలేనేమో! ఇక్కడ నాకు పని ఒత్తిడి ఎక్కువగా వుంది. అందుచే ఉత్తరాలు ఇక వ్రాయవద్దని కోరుతున్నాను.

ఇట్లు
యామిని

ఆ ముద్దుకీ ఈ ముద్దుకీ తేడా ఏమిటి? అనుకుంటూ ఇప్పటికీ ఆలోచిస్తుంటాడు కృష్ణమూర్తి.

## సుభాషితాలు

లోకంలో అన్నీ తేలిక అనుకున్నవాడు చాలా కష్టాలు ఎదుర్కొంటాడు.

—లావోత్సే

* * *

ఎన్ని గ్రంథాలు చదివావు? అని కాదు, ఎటువంటి గ్రంథాలు చదివావు? అనేది ముఖ్యం.

—కాల్టన్

* * *

వ్యక్తిగా ప్రతివారినీ గౌరవించు. కాని, ఎవరినీ విగ్రహంగా మార్చకు.

—అల్బర్ట్ ఐన్‌స్టీన్

* * *

కొత్తవాళ్ళను చూస్తే కుక్కలు మొరిగినట్టు గొప్పవాళ్ళను జనం గేలిచేస్తారు.

—సెనెకా

* * *

సంఘానికీ, తనకీ సామరస్యం కుదిరేదాకా కవి చేసే అంతర్, బహిర్ యుద్ధారావమే కవిత్వం.

—చలం

* * *

లక్ష్యసిద్ధిపూరిత చదువు చక్కని నడవడినిస్తుంది.

—హెచ్. స్పెన్సర్

* * *

ఇచ్చిపుచ్చుకోవడాలు లేకుండా సంఘజీవనం వుండుట అసహజము.

—శామ్యూల్ జాన్సన్

* * *

నీవు నవ్వని రోజుపూర్తిగా వ్యర్థమవుతుంది.

—కేవ్‌ఫర్డ్

—ఎ.ఎన్.ఎస్. శంకరరావు,
రేపల్లె